క్లుప్తంగా

రక్తదానంపై అవగాహన ర్యాలీ



రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతలలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా యువమోర్చా నాయకులు ఈ.రాజశేఖర్‌రెడ్డి నేతృత్వంలో రక్తదానంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రక్తదాన శిబిరంలో 22 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పాశం మట్టారెడ్డి, జిల్లా కార్యదర్శి సూరపురెడ్డి పుల్లారెడ్డి, పోకూరి కాశీపతి, బోయనాగిరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గొంటు సుమంత్ రెడ్డి, పీహెచ్‌సీ మాజీ చైర్మన్ బి. రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి చెన్నకేశవులు పాల్గొన్నారు.

పాస్టర్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం



గురజాల: మండల పాస్టర్స్ పెలోషిప్ ఆధ్వర్యంలో పాస్టర్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. నగర పంచాయతీలోని కింగ్‌డమ్ గాస్పల్ చర్చిలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము నాగేశ్వరరావు మాట్లాడుతూ అసోసియేషన్‌ను ఏర్పాటు చేసి 18 సంవత్సరాలు పూర్తయిందన్నారు. పాస్టర్‌లు అందరూ ఐకమత్యంగా ఉండి అసోసియేషన్ అభివృద్ధి చెందే విధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు నాయక్, మధుబాబు, జాకబ్, కుక్కమూడి చిన థామస్, జాన్ సైమన్, జయప్రకాష్, డేవిడ్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీతకు సన్మానం



మాచర్లరూరల్: వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో పదో తరగతి ఫలితాలలో నూరు శాతం ఫలితాలతో పాటు ఐఎంఎంఎస్ సీట్లు సాధించిన ఘనత హెచ్ఎం ఆర్.విజయకుమారికే దక్కుతోందని ప్రముఖ న్యాయవాది చిలమకూరి నాగిరెడ్డి అన్నారు. జిల్లా ఉత్తమ అవార్డు అందుకున్న ఆర్.విజయకుమారిని బుధవారం మదర్‌థెరిస్సా సేవా సమితి నేతృత్వంలో ఘన సన్మానించారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు గాదె కిరీటిరెడ్డి, ఉపాధ్యాయులు పామిరెడ్డి విజయలక్ష్మి, ఆర్.శివపార్వతి, నిర్మలామేరి, రాజేశ్వరమ్మ, సభ్యులు ఎం.భాస్కరరెడ్డి, చంద్రయ్య, శాంతిరెడ్డి, పాపిరెడ్డి, చిన్నపరెడ్డి, బాలజోజి, యరబోతుల శ్రీనివాసరావు, మహేష్, శ్రీనివాసరాలు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ

కారెంపూడి: మండలంలోని గాదెవారిపల్లెలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు దోర్నాల బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

వ్యర్థాలు డంపింగ్ యార్డులో వేయాలి

మాచర్ల: పట్టణంలోని చంద్రవంక నదిలో హైవేల పక్కన వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ బి.కిరణ్‌కుమార్‌కు శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మెట్టు గోవిందరెడ్డి బుధవారం వినతి పత్రం అందజేశారు. ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు.

రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదులు వెల్లువ



గురజాల: స్థానిక చల్లగుండ్ల గార్డెన్స్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో రెవెన్యూ సమస్యలపై ఫిర్యాదులు వెలువెత్తాయి. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శాశ్వత కోర్టు భవనాల నిర్మాణం చేపట్టే విధంగా చూడాలని అర్జీ అందజేశారు. తొలుత స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మెడికల్ క్యాంపును ప్రారంభించారు. కార్యక్రమాల్లో నగర పంచాయతీ చైర్మన్ షేక్ బడేజానీ, ఎస్.బొల్లయ్య, మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, నవులూరి శ్రీరామమూర్తి, ఆకుల పిచ్చయ్యగుప్తా, పులుకూరి కాంతారావు పాల్గొన్నారు.

వరదొస్తే పట్టణం మునకే..



పిల్లుట్ల రోడ్డులో బుగ్గవాగును పూడ్చివేస్తున్న దృశ్యం



బుగ్గవాగులోకి మట్టితో పూడ్చిన వైనం

- గతంలో పిడుగురాళ్ల వాగులు, వంకలతో కళకళ
- నేడు వాగులన్నీ పచ్చనేతల కబ్జా

పిడుగురాళ్ల: వాగులు, వంకలు కబ్జా బారిన పడుతున్నాయి. ఒకప్పుడు నీటి అవసరాల కోసం ఏర్పాటు చేశారు. పచ్చనేతల కన్నుపడింది. వీటిని యథేచ్ఛగా పూడ్చేస్తున్నారు. బుగ్గవాగు కుదించుకుపోతోంది. పిడుగురాళ్ల పట్టణానికి ప్రధానంగా బుగ్గవాగు, యర్రవాగు, నక్కల వాగులు ఉన్నాయి. అయితే భారీ వర్షాలు కురిసినప్పుడు పంట పొలాలోని నీరు, పై కాలువల్లో పారే నీరు వరద నీరు మొత్తం ప్రధానంగా బుగ్గవాగు, యర్రవాగులో చేరుతోంది. ఈ వాగులు విశాలంగా ఉండటంతో ఎంత పెద్దగా నీరు వచ్చినా వాగులో నుంచే ప్రవహిస్తాయి. పిడుగురాళ్ల పట్టణం ముంపునకు గురికాకుండా ఆపద్బంధువుడిగా ఉండే బుగ్గవాడు, యర్రవాగులు కబ్జాకు గురవుతున్నాయి. పెద్ద వాగులు కాస్తా పిల్ల కాలువలుగా మారుతున్నాయి. భారీ వరదొస్తే పరిస్థితి దారుణంగా ఉంటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

పిల్లుట్ల రోడ్డులోని బుగ్గవాగు అనుకొని గోవిందాపురం కృష్ణానది నీటి పైపులు పిడుగురాళ్ల పట్టణానికి వేశారు. ఈ పైపులైన్లు పూడ్చే విధంగా వాగులపై మట్టి తరలించి చదును చేశారు. మరింత స్థలం కోసం వాగు లోపలకి పెద్ద పెద్ద రాళ్లను వేసి ఆ రాళ్లపై మట్టిని తోలుతున్నారు. గతంలో కూడా కృష్ణానది నుంచి వచ్చే నీటి పైపులు లీక్ కావటం వలన పట్టణంలోని ఒక ప్రాంతమంతా డయేరియా సమస్యతో అల్లాడింది. అయితే పైపు కనిపించింది కాబట్టి అధికారులు గుర్తించి వెంటనే పరిష్కారం చూపించారు. అదే మట్టిలో కనిపించని లీకులు అయితే ఎంతో మంది ప్రాణాలకు ప్రమాదం వాటిల్లుతుందని పట్టణ ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

భూములకు ధరలు రావటంతోనే...

పిడుగురాళ్ల పట్టణంలో బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తి కావటంతో బైపాస్‌కు ఇరువైపులా వ్యాపార సముదాయాలు పెరిగాయి. ఈ ప్రభావంతో బైపాస్ రోడ్డుకు ఇరువైపులా భూములకు భారీగా ధరలు పెరిగాయి. దీంతో బైపాస్ రోడ్డుకు దగ్గరగా ఏ భూమి ఉంది అని ప్రత్యేకంగా అధికార పార్టీకి చెందిన నాయకులు పరిశీలించి వారికి తక్కువ ఖర్చుతో ఎక్కువ భూమి ఏ ప్రాంతంలో వస్తుందో ఆ ప్రాంతాన్ని నిర్ణయించుకొని వారు భూములను అక్రమించే కార్యక్రమంలో ఉన్నారు. ఈ క్రమంలోనే పిల్లుట్ల రోడ్డులోని బుగ్గవాగుని ఆక్రమించే కార్యక్రమంలో అధికార పార్టీ నాయకులు నిమగ్నమయ్యారు. అలాగే గుంటూరు రోడ్డులో యర్రవాగులో ఏకంగా సిమెంట్‌వాల్స్‌ను నిర్మించి వాగు స్థలాన్ని అక్రమించారు.

తహసీల్దార్ మధుబాబు ఏమన్నారంటే..

పిల్లుట్ల రోడ్డులో బైపాస్ రోడ్డులో ఉన్న బుగ్గవాగు అక్రమణలకు గురవుతున్న విషయం తన దృష్టికి రాలేదు. ప్రస్తుతం ఆర్‌డీఓ కార్యాలయంలోని మీటింగ్‌లో ఉన్నా. రాగానే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

మొక్కలు నాటుదాం- పర్యావరణాన్ని పరిరక్షిద్దాం



వియపురిసోత్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఏపీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నయింభాను అన్నారు. బుధవారం ఓజోన్ డే ను పురస్కరించుకొని కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణానికి ముప్పు వాటిల్లితే ఓజోన్ పొరకు రంధ్రం పడుతుందన్నారు. విద్యార్థులు జట్లుగా ఏర్పడి మొక్కలను ప్రజలకు అందజేసి మొక్కలు నాటడం వలన కలిగే ప్రయోజనాలను ఓజోన్ పొర పరిరక్షణకు తమ వంతుగా చేయాల్సిన కృషిని వివరించారు. అనంతరం మొక్కలు నాటదాం- పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అంటూ అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఎం.యానాది రావు, ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో కష్టపడితే తగిన గుర్తింపు

పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు పీఆర్కే



పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

రెంటచింతల: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేసిన వారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి చెప్పారు. మండలంలోని పాత పాలువాయి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు కొక్కండ్ల బ్రహ్మంను పార్టీ అధిష్టానం మాచర్ల నియోజకవర్గ వాణిజ్య విభాగ అధ్యక్షుడిగా ఎంపిక చేసింది. బుధవారం పీఆర్కేను కలసి సన్మానించారు. పీఆర్కేను కలిసిన వారిలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి, పాలువాయి గేటు సర్పంచి గొలమారి నాగలక్ష్మి శ్రీనివాస రెడ్డి, పాలువాయి మాజీ సర్పంచి మందలపు శ్రీనివాస రెడ్డి, రెంటచింతల మాజీ ఉప సర్పంచి ఏలూరి సత్యం, పార్టీ నాయకులు యర్రెద్దు శ్రీనివాసరెడ్డి, శౌంతిరెడ్డి చిన గురువారెడ్డి, కొక్కండ్ల నరసింహారావు, చింత సుబ్బారావు, పులి కోటిరెడ్డి, గుండా కిశోర్, గుంటా నరేంద్రారెడ్డి, రవి, గొట్టం శ్రీనివాసరెడ్డి, ప్రదీప్ ఉన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయండి...

వెల్దుర్తి: వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం మండల అధ్యక్షుడుగా నియమితులైన పేరుపోగు కిషోర్‌ను పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అభినందించారు. బుధవారం మాచర్ల పట్టణంలోని వైఎస్సార్ సీపీ క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో పీఆర్కే మాట్లాడారు. మండలంలోని మండాది గ్రామానికి చెందిన పేరుపోగు కిషోర్‌ను మండల ఎస్సీ విభాగం అధ్యక్షుడుగా ఎంపిక చేశామన్నారు. పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కష్టపడి పనిచేయాలన్నారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మండాది ఎంపీటీసీ సభ్యుడు పేరుపోగు కాంతారావు, కుమార్, దొరగొడ్ల బుజ్జి, చిన్నా, తాళ్లూరి దాసు పాల్గొన్నారు.

భద్రయ్య కుటుంబానికి పరామర్శ

మాచర్లరూరల్: అనారోగ్యంతో మృతి చెందిన మండలంలోని మండలంలోని తాళ్లపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మెరికేపల్లి భద్రయ్య భౌతిక కాయాన్ని పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బుధవారం సందర్శించారు. భద్రయ్య అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి పోతిరెడ్డి కోటిరెడ్డి, పార్టీ నాయకులు బూడిద శ్రీనివాసరావు, బూడిద సైదులు, జూకూరి వెంకటరామయ్య, బ్రహ్మయ్య, ఈశ్వరయ్య, శ్రీనునాయక్, ప్రసాద్ పాల్గొన్నారు.

హెచ్ఎం రమణరావుపై చర్యలు తీసుకోవాలి



ఎంఈఓ శ్రీనివాసరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

దాచేపల్లి: మండలంలోని మాదినపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎస్వీ రమణారావు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డికి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కోట సాయికుమార్ మాట్లాడుతూ... పదో తరగతి విద్యార్థుల నుంచి టీసీ ఇచ్చేందుకు రూ.500 చొప్పున వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యార్థుల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తూ హెచ్ఎం ఇబ్బంది పెడుతున్నారని ఆయన పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, మధ్యాహ్న భోజనం సమయంలో విద్యార్థులతో పనులు చేయిస్తున్నారని ఎంఈఓ దృష్టికి తీసుకెళ్లారు. హెచ్ఎంపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు కడియం రోహిత్, రామకృష్ణ, మండల కమిటీ సభ్యులు నాగూర్, ఉదయ్ పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల కరదీపికల ఆవిష్కరణ



ఉత్సవ కరదీపికలను ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

కారెంపూడి: దసరా ఉత్సవాల కరదీపికలను వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో కారెంపూడి మండల ఆర్యవైశ్య సంఘ నాయకులు బుధవారం ఆవిష్కరించారు. అమ్మవారి దేవాలయంలో దసరా సందర్భంగా నిర్వహించనున్న దేవీశరన్నవరాత్రి మహోత్సవాలలో ప్రతి రోజు జరగనున్న పూజలను వివరిస్తూ రూపొందించిన ఉత్సవ పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షులు మద్దు హనుమంతరావు, నాయకులు కొత్తమాసు వేంకటరామ్మోహనరావు, కందుకూరి వెంకటేశ్వర్లు, యక్కల శ్రీను, మాజీ అధ్యక్షులు చీతిరాల వెంకట కోటేశ్వరరావు, కొలిశెట్టి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే పల్నాటి వీర్ల అంకాలమ్మ తల్లి దేవాలయంలో జరగనున్న దసరా ఉత్సవాల కర పత్రాన్ని కూడా పూజారులు విడుదల చేశారు.

శీతల భవన నిర్మాణ పనులకు భూమి పూజ

రూ.11 కోట్ల 80 లక్షల వ్యయంతో నిర్మాణం

ఈపూరు (శావల్యాపురం): ఈపూరు సొసైటీ సారథ్యంలో నాబార్డు మంజూరు చేసిన నిధులతో శీతల గిడ్డంగి కేంద్రం (కోల్డ్‌స్టోరేజీ భవనం) నిర్మాణ పనులకు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బుధవారం భూమి పూజ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ ఆరుగాలం రైతులు సాగు చేసిన పంటలు గిట్టుబాటు ధర లేని సమయంలో కోల్డ్ స్టోరేజ్‌లో నిల్వ ఉంచుకునేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కల్గిన నూతన కోల్డ్ స్టోరేజీ రూ.11 కోట్లు 80 లక్షల వ్యయంతో నిర్మాణ పనులు పారదర్శకంగా ఆరు నెలల వ్యవధిలో పూర్తి అయ్యేలా క్షేత్రస్థాయిలో సొసైటీ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు. ఇందుకుగాను ఒక ఎకరం 10 సెంట్లు స్థలం కేటాయించామన్నారు. రానున్న రోజుల్లో రైతులకు మరింత మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఆన్‌లైన్‌లో టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ సారథ్యంలో కోల్డ్‌స్టోరేజీ భవన నిర్మాణ పనులు జరుగుతాయన్నారు. 10 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కల్గిన కోల్డ్‌స్టోరేజీ లో రైతులు సాగు చేసిన అన్నీ రకాల పంటలు నిల్వ చేసుకునేలా ఆధునీకరణ పరికరాలు ద్వారా నిర్మాణ పనులు జరుగుతాయన్నారు. వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) తరుపున నిర్మించనున్న కోల్డ్‌స్టోరేజీలో రైతులకు తక్కువ ధరకు నిల్వ చేసుకోవటం పాటు నిల్వ ఉంచిన పంటలకు తక్కువ వడ్డీరేటుకు రుణాలు మంజూరు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, ఈపూరు సొసైటీ అధ్యక్షులు ఇ.హనుమయ్య పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

మాచర్ల: రక్తదానం ప్రాణదానంతో సమానమని వికాస్ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ పఠాన్ నాగూర్‌వలి అన్నారు. నేషనల్ వాలంటరీ బ్లడ్ డొనేషన్ డే డ్రైవ్ సందర్భంగా మాచర్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో బుధవారం విద్యార్థులు రక్తదానం చేశారు. ఈసందర్భంగా నాగూర్‌వలి మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు అత్యంత ప్రధానమైన బ్లడ్ డొనేషన్ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనటం ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ఈసందర్భంగా విద్యార్థులను అభినందించారు. సమాజం పట్ల బాధ్యతాయుతంగా యువత మరిన్ని మంచి కార్యక్రమంలో పాల్గొనాలని కళాశాల చైర్మన్ మారెపల్లిలక్ష్మీనారాయణ, డైరెక్టర్ వెంకటనారాయణ ఆంజనేయ శాస్త్రి అన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.పి.చారి, క్యాంపు పర్యవేక్షకులు రజాక్, రక్తదానం చేసిన వి.మల్లికార్జున, ఎం.అజయ్, ఎం.మణికంఠ, పి.శ్రీకాంత్, వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

యూటీఎఫ్ రణభేరి ప్రచార జాతా నేడు రాక

పిడుగురాళ్ల: విద్యారంగంలో సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ ఆధ్వర్యంలో రణ భేరి కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్లు నాయకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిలకలూరిపేటలో ప్రారంభమైన రణభేరి నరసరావుపేట మీదుగా పిడుగురాళ్ల పట్టణానికి మధ్యాహ్న సమయానికి చేరుకుంటుందని వివరించారు. అనంతరం మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద సమావేశం నిర్వహించనున్నట్ల చెప్పారు. పిడుగురాళ్ల ప్రాంతీయ శాఖల ఉపాధ్యాయులు అందరు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మండల అభివృద్ధికి కృషి చేద్దాం



వెల్దుర్తి: మండలాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా పనిచేయాలని మండల పరిషత్ అధ్యక్షుడు అలుగుమల్లి సంజీవరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ప్రాధాన్య క్రమంలో పనులు చేపట్టాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాలలో పర్యటించి సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాలలో వైరల్ ఫీవర్‌లు ఎక్కువగా ఉన్నాయని, ఆరోగ్యశాఖాధికారులు క్యాంపులు నిర్వహించి జ్వరాలను కట్టడి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్, తహసీల్దార్ రాజశేఖర్‌నాయక్, ఏఈలు శ్రీనివాసరెడ్డి, బాబునాయక్, ఏఓ బాలాజి గంగాధర్, వైద్యాధికారులు లక్ష్మీప్రసన్న, ఈఓపీఆర్డీ మకట్‌లాల్ పాల్గొన్నారు.

అంతిమ యాత్రలోనూ ఆసరాగా..

కారెంపూడి: అనాథలను ఆదుకోవడమే కాదు మృతి చెందిన తర్వాత బంధువులు ఎవరూ స్పందించకుంటే అంత్యక్రియలు కూడా నిర్వహించి పెద్ద మనస్సును చాటుకుంటున్నారు పిడుగురాళ్ల సమీపంలోని కొండమోడు దీనమ్మ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతినిధులు. వివరాలు.. కారెంపూడి మండలం ఒప్పిచర్ల గ్రామానికి చెందిన కారంచెట్టు లక్ష్మమ్మ(68) బుధవారం మృతి చెందింది. 20 ఏళ్ల క్రితం భర్తకు దూరమైన ఆమె కొన్నాళ్లు గ్రామంలో అద్దె ఇంట్లో ఉందని అద్దె కట్టలేని స్థితిలో ఉన్న ఆమెను బంధువులు గ్రామంలోని సత్రంలో వదలివేయడంతో గ్రామస్తులు కొందరు పెద్ద మనస్సుతో ఆమెను అనాథాశ్రమంలో చేర్చారు. మృతి చెందడంతో బంధువులకు సమాచారం ఇచ్చారు. పిడుగురాళ్లలో ఉంటున్న ఆమె చెల్లెలు అక్క మృతదేహం చూడడానికి వచ్చింది. అయితే ఆమె కూడా భర్తకు దూరమై పేదరికంతో ఉన్నానని అంత్యక్రియల ఖర్చులు భరించలేనని మీరే పెద్ద మనసుతో అంత్యక్రియలు చేయాలని కోరినట్లు ఆశ్రమం ప్రతినిధులు తెలిపారు. దీంతో బుధవారం రాత్రి అంత్యక్రియలు నిర్వహించినట్లు సొసైటీ ప్రతినిధి శంకరరావు తెలిపారు. ఆశ్రమం పెట్టిన 2012 నుంచి ఇప్పటి వరకు 28 మందికి ఇలాగే అంత్యక్రియలు నిర్వహించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

గుడి ఆస్తి అన్యాక్రాంతంపై ఫిర్యాదు

యద్దనపూడి: స్థానిక చిన్నాంజనేయస్వామిగా ప్రసిద్ధి చెందిన ప్రపత్తి ఆంజనేయ స్వామి గుడికి చెందిన స్థిరాస్తిని అక్రమంగా అన్యాక్రాంతం చేసేందుకు యత్నాలు జరుగుతున్నాయని ఆలయ కమిటీ సభ్యులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆలయ నిర్వహణ బాధ్యతలు చూస్తున్న వ్యక్తి తన భార్య పేరు మీద ఆలయానికి చెందిన వాణిజ్య దుకాణాలకు అక్రమంగా హక్కు పత్రాలు పొందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

బ్యాంకు తాకట్టుతో వెలుగులోకి..

సుమారు మూడు సెంట్ల విస్తీర్ణంలో నిర్మించిన ఆ దుకాణాలను రుణం కోసం తనఖా పెట్టేందుకు వాటిని బ్యాంకులో దరఖాస్తు చేయగా, బ్యాంకు సిబ్బంది తనిఖీ కోసం దుకాణాల వద్దకు వచ్చిన క్రమంలో తమకు విషయం తెలిసినట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, బాధ్యుడైన నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కమిటీ సభ్యులు కోరారు. ఈ విషయమై అధికారులకు కూడా ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు.

విచారణ అనంతరం చర్యలు..

ఈ ఫిర్యాదు చేసిన వారిలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటనర్సు, దేసు ఆంజనేయులు, చీమకుర్తి కిషోర్, ఐతా రామకోటేశ్వరరావు, బత్తు రాజేష్, కొల్లా సుబ్బారావు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఉన్నారు. ఈ విషయంపై ఎస్ఐ శివరామకృష్ణను వివరణ కోరగా, ఆలయానికి సంబంధించిన పత్రాలను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.